



పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో క్రిస్మస్ వేడుకలు

ఇంటి దొంగలు..!

- ఖాళీ కనబడితే మారుతున్న పత్రాలు
- 'అనంత'లో మరో ఘటన
- పోలీసులను ఆశ్రయించిన బాధితుడు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఇప్పటి వరకు ఇళ్లకు తాళమేస్తే దొంగలుపడి ఇంట్లోని సొమ్ములు దోచుకుపోతారన్న భయముండేది. ఇప్పుడు పరిస్థితులు అలాకాకుండా ఇంట్లో ఎవరూ లేకుంటే చాలు ఇంటి పత్రాలే ఇతరుల పేరు మీద మారిపోతున్నాయి. కుటుంబ సభ్యులు ఎప్పుడో చూసుకునే సరికి అన్నీ జరిగిపోతున్నాయి. బాధితులు అధికారులను ఆశ్రయించి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. తాజాగా అనంతపురం శారదనగర్‌లో ఒక ఇంటి వ్యవహారం ఇదే రకంగా జరగడం చర్చనీయాంశమైంది. డిసెంబర్ 2024లో రోడ్డు ప్రమాదంలో కనకరదుర్గ అనే మహిళ రాజమండ్రి వద్ద చనిపోయారు. ఆమెకు పెళ్లికాలేదు. పిల్లలు లేని ఆమె బంధువులున్నా ఇతర ప్రాంతాల్లో ఉంటున్నారు. ఎవరూ లేకపోవడం చూసి కొందరు అక్రమార్కులు 2025 మార్చిన శంకుతల, శేఖర్ పేరుతో జిపిఎ చేయించుకుని వారి పేరు మీదకు ఆస్తిని మార్చుకున్నారు. దీనిపైన కనకదుర్గ మేనల్లుడు సాయిమనోహర్ గురువారం అనంతపురం డీఎస్పీ శ్రీనివాసులు ఫిర్యాదు చేశారు. తమ వద్దనున్న డాక్యుమెంట్లను అందజేశారు. దీనిపై చర్యలు తీసుకోవాలని డీఎస్పీని కోరినట్టు సాయిమనోహర్ తెలిపారు. తాము ఇంట్లోకి వెళ్లేందుకు వీల్లేకుండా ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి తమపైనే దాడికి దిగుతున్నారని చెప్పారు. దీనిపై పోలీసులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ రకంగా అనంతపురం నగరంలోని శారద నగర్‌లో ఇంటికి తాళం వేసి ఉండటం, కనకరదుర్గకు ఎవరూ లేరని గుర్తించి ఈ రకంగా రికార్డులు తారుమారు చేసి ఆస్తిని కొట్టేసే ప్రయత్నం చేసారన్న చర్చ నడుస్తోంది. దీనికి వ్యతిరేకంగా స్థానిక కార్పొరేటర్, భర్త జయరాం నాయుడు కూడా బుధవారం నాడు ఇంటి వద్దనే ధర్నా చేశారు. అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని ధర్నాలో డిమాండ్ చేశారు. ఇలా ఇంటికి తాళం వేస్తే చాలు ఇళ్లు మారిపోతుండటం గమనార్హం. ఇకపోతే గత కొన్ని నెలల క్రితం కూడా ఇదే రకమైన ఘటన అనంతపురం నగరంలో చోటు చేసుకుంది. సాయినగర్ ఏడవ క్రాస్‌లో డబుల్ రిజిస్ట్రేషన్ చేసుకుని క్లీనిక్‌కు తాళం వేసేందుకు కొంత మంది ప్రయత్నించారు. అది పెద్ద వివాదమే చోటు చేసుకుంది. అంతకు మునుపు నారాయణపురం పంచాయతీ పరిధిలో ఎకరం భూమి సొంత యజమానులకు తెలియకుండా రిజిస్ట్రేషన్ జరిగింది. వారు కూడా వృద్ధ దంపతులు పెద్దగా అండదండల్లేని వారు కావడంతో ఈ పని చేసినట్టు ఆరోపణలొచ్చాయి. దీనిపైనా ఆ దంపతులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్‌లకు ఫిర్యాదు చేయడం జరిగింది. ఆ తరువాత రెవెన్యూ అధికారులు స్పందించి పరిశీలించి డబుల్ రిజిస్ట్రేషన్ జరిగినట్టుగా గుర్తించారు. ఇలా వరుసగా డబుల్ రిజిస్ట్రేషన్ల వ్యవహారం వెలుగులోకి వస్తునే ఉన్నాయి. వాటిపై ఏ మేరకు చర్యలు తీసుకుంటున్నారన్నది ప్రశ్నార్థకంగానే ఉంటోంది. ఇప్పటి వరకు ఈ భూములు ఎవరూ కబ్జా చేస్తున్నారన్న దానిపై ఎటువంటి చర్యలుండటం లేదు. అది సివిల్ మ్యాటర్‌గా చూపించి మొక్కుబడి చర్యలతోనే సరిపెడుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇక అనంతపురం నగరంలోని పాపంపేటలో ఏకంగా వందల ఎకరాలకే ఎసరుపెట్టిన విషయం తెలిసిందే. నగరం పరిధిలో ఎప్పుడు ఏ భూమికి ఎసరు వస్తుందోనని గుబులు స్థల యజమానుల్లో ఉంది.



క్రీస్తుస్మరణ..!

- జిల్లా వ్యాప్తంగా క్రిస్మస్ సంబరాలు
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- శాంతిసందేశం విన్పించిన పాస్టర్లు

ప్రజాశక్తి-అనంతపురం

ఏసు క్రీస్తు బాలయేసుగా భూమిపై అవతరించిన వేళ క్రీస్తుస్మరణ మారుమోగింది. చర్చిల్లో స్టార్లు కాంతులీనాయి. క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలతో మురిసిపోయాయి. జిల్లా అంతటా క్రిస్మస్ శోభ సంతరించుకుంది. బుధవారం రాత్రి నుంచే చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభం అయ్యాయి. గురువారం మధ్యాహ్నం వరకు ఇవి కొనసాగాయి. క్రిస్టియన్లు నూతన దుస్తులు ధరించి హ్యాపీ క్రిస్మస్.. మెర్రీ క్రిస్మస్ అంటూ పరస్పర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బిషప్‌లు, ఫాదర్లు, పాస్టర్లు, శాంతిసందేశం వినిపించారు. ఏసు మార్గంలో నడవాలని సూచించారు. చాలా చర్చిల్లో సేవా కార్యక్రమాలను చేపట్టారు. జిల్లా కేంద్రలోని సప్తగిరి సర్కిల్‌లోని సిఎస్ఐ చర్చి, అరవిందనగర్‌లోని ఎస్ఐసియు చర్చి, నాయక్ నగర్‌లోని అగాపే కల్వరి చర్చి, రామచంద్ర నగర్‌లోని మేరీ చర్చిలు క్రిస్టియన్లతో కిటకిటలాడాయి. ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు చర్చిల్లో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని క్రిస్టియన్ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు.

కురవల్లిలో కార్డెన్ సెర్చ్



తనిఖీలు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం ఎస్ఐ నబిరసూల్ ఆధ్వర్యంలో పోలీసులు మండల పరిధిలోని కురవల్లి గ్రామంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్ఐతో పాటు పోలీసులు ఉదయమే ఆ గ్రామం చేరుకుని పాతనేరస్తులు, అనుమానితుల ఇళ్లలో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. అలాగే గడ్డి వాములు, చెట్లు, ముళ్లపొదలు, తదితర ప్రాంతాల్లో సోదాలు చేశారు. ఎస్ఐ నబిరసూల్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు శాంతి భద్రతలకు భంగం కలిగించకుండా ప్రశాంత జీవనం సాగించాలని సూచించారు.

చలికాలంలో జాగ్రత్తలు అవసరం

వైరస్‌తో వ్యాధులు సంక్రమించే అవకాశం - ప్రభుత్వ హోమియోపతి వైద్యుడు డా॥రాజశేఖర్



ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

'ప్రస్తుతం చలి తీవ్రత ఎక్కువగా ఉంది. ఉదయం, రాత్రి వేళల్లో చలిగింతలు పెడుతున్నాయి. చలితీవ్రత ఇలా ఉంటే ఇదే సమయంలో ఈ కాలంలో వ్యాధులు సక్రమించే అవకాశం కూడా ఉంది. చలికాలంలో వైరస్ వల్ల పలు జబ్బులకు గురయ్యే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది.' అని బుక్కరాయసముద్రం ప్రభుత్వ హోమియోపతి వైద్యుడు డా॥రాజశేఖర్ తెలియజేశారు.

చలికాలంలో రాత్రిళ్లు ఉష్ణోగ్రతలు పడిపోతున్న నేపథ్యంలో చిన్నపిల్లలు, వృద్ధులు శ్వాసకోశ సమస్యలు ఎదుర్కొంటారు. ప్రస్తుతం ప్రతి ఇంట్లో ఎవరో ఒకరు జలుబు దగ్గు, జ్వరం, ముక్కు కారడం వంటి లక్షణాలతో బాధపడుతున్నారు. ఈ జబ్బు ఇంట్లో ఒకరికి మొదలైతే మిగతా అందరికి వైరస్ సోకే అవకాశం ఉంది. రోగనిరోధక శక్తి తక్కువ ఉన్నవాళ్లు త్వరగా సిక్ అవుతారు. ఇంట్లో ఎవరికైనా ఫ్లూ వస్తే వాళ్ల లక్షణాల్ని ఆధారం చేసుకుని మిగతా వాళ్లకు వైరస్ సోకకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. జాగ్రత్తలతో పాటు హోమియోపతి ద్వారా వైద్యం అందించవచ్చు.

ఫ్లూ అంటే ఏంటి .?

ఫ్లూ ఇన్ఫ్లుఎంజా వైరస్ వల్ల వచ్చే అంటువ్యాధి. చల్లటి వాతావరణంలో ఈ వైరస్ బాగా వ్యాప్తి చెందుతుంది. చెవి, ముక్కు, గొంతు, ఊపిరితిత్తులను ప్రభావితం చేస్తుంది. సాధారణంగా కొన్ని రోజుల్లో తగ్గిపోతుంది. కొన్నిసార్లు తీవ్ర సమస్యలకు దారితీయవచ్చు. చలికాలంలో వ్యాప్తి చెందే ఫ్లూ లేదా ఇన్ఫ్లుఎంజా కాలానుగుణ వ్యాధి. దీనివల్ల జ్వరం, దగ్గు, తుమ్ములు, ముక్కు నుంచి నీరు కారడం, కండరాల నొప్పులు, గొంతు నొప్పి, తలనొప్పి, అలసట, నీరసం లాంటి లక్షణాలు ప్రధానంగా కనిపిస్తాయి. వీటికి సరైన వైద్య చికిత్స తీసుకోకపోతే న్యుమోనియా, చెవి ఇన్ఫెక్షన్లు, సైనస్ ఇన్ఫెక్షన్లు, ఆస్తమా తీవ్రత పెరగడం, గుండె సమస్యలు వంటి తీవ్రమైన సమస్యలకు దారితీస్తాయి. చిన్న పిల్లలు, వృద్ధులు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారిలో ఈ సమస్యలు ఎక్కువగా కనిపిస్తాయి.

ఎలాటి జాగ్రత్తలు తీసుకోవాలి.?

పొగమంచు, చలికి తట్టుకునేందుకు స్వెట్టర్లు, మఫ్లర్లు, క్యాప్‌లు, సాక్స్‌లు ధరించాలి. ఉదయం, సాయంత్రం చల్లని గాలుల నుంచి రక్షణ చర్యలు తీసుకోవాలి. అత్యవసరం అయ్యి బయటకు వెళ్లేటప్పుడు చెవి, ముక్కు, నోటికి మాస్కులు ధరించాలి. ప్రతి రోజూ నడవడం, వ్యాయామం లాంటివీ చేయాలి. ఎప్పటికప్పుడు చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. ఇంట్లో అందరి ముందు తుమ్మడం లాంటివి చేయకూడదు. ఆహారపు ఆలవాట్లను మార్పు చేసుకోవాలి. రాగులు, జొన్నలు, రాగి గంజి, మునగ వంటి పోషకాలున్న ఆహారాలు తీసుకోవాలి. అల్లం, వెల్లుల్లి, పసుపు లాంటి వాటిని రోజు మనం తినే ఆహారంలో చేర్చాలి. ఆహార పదార్థాలు ఏవైనా వేడిగా తినాలి. చలికాలంలో నీటిని తక్కువగా తాగడం మంచిది.

హోమియో చికిత్సలు

చలికాలంలో వచ్చే వ్యాధులకు హోమియోపతి ద్వారా వైద్య చికిత్సలు తీసుకోవడం మంచిది. జలుబు, జ్వరం, ముక్కు నుంచినీరు కారడం పొడి చర్మం, ఎముకల నొప్పులు, తలనొప్పి, మైకం లాంటి లక్షణాలు ఉంటే హోమియోపతి మందులు వాడడం ద్వారా ఉపశమనం లభిస్తుంది. ఇన్ఫ్ల్యుయెంజినమ్ హోమియోపతి ఔషధాన్ని సీజనల్ ఫ్లూ నుంచి రక్షణ కోసం నివారణాత్మకంగా ఉపయోగించవచ్చు. చర్మ సమస్యలకు సల్ఫర్ చర్మం పొడిబారడం, దురద వంటి వాటికి ఉపయోగపడుతుంది. హోమియోపతి మందులను స్వయంగా వాడడం కన్నా సమీపంలోని హోమియోపతి వైద్యులను సంప్రదించి వినియోగించడం మంచిది.

కార్పొరేషన్‌లో అక్రమార్కులపై చర్యలేవీ..?

- అడ్డగోలు ఉద్యోగోన్నతులపై హైకోర్టు ఆగ్రహం
- నకిలీ బిల్లులతో ఖజానాకు చిల్లు
- నిర్మాణాల క్రమబద్ధీకరణలోనూ చేతివాటం



ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం కార్పొరేషన్‌కు సంబంధించి డీజిల్ బిల్లుల అక్రమాలు, ఉద్యోగోన్నతులు, నిర్మాణాల క్రమబద్ధీకరణ తదితర విషయాల్లో తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల ఓ ఉద్యోగి ఉద్యోగోన్నతి విషయంలో హైకోర్టు అక్షింతలతో వాటిని రద్దు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. సీనియార్టీని పక్కనబెట్టి అక్రమాలకు తెరలేపి అడ్డగోలుగా ఉద్యోగోన్నతులను కల్పించిన వారిపై చర్యలు తీసుకోవడంలో మాత్రం ఇప్పటికీ మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఉద్యోగుల రిటైర్మెంట్, పదోన్నతుల సమయంలో ఏర్పడి ఖాళీలను భర్తీ చేసేప్పుడు సీనియార్టీ జాబితాను తయారు చేస్తారు. వరుస క్రమంలో సీనియార్టీలో మొదట ఉన్నవారికి ఉద్యోగోన్నతి కల్పించాలని మున్సిపల్ సర్వీసు రూల్స్ చెబుతున్నాయి. కార్పొరేషన్‌లో కొంతమంది అధికారులు నిబంధనలను పక్కనబెట్టి కాసులకు కక్కుర్తి, నేతల సిఫార్సులకు తలొగ్గి సీనియార్టీ జాబితాను పక్కన పెట్టేశారు. సీనియర్లను కాదని వారి స్థానంలో జూనియర్‌గా ఉన్నవారికి ఉద్యోగోన్నతి కల్పించారు. ఉద్యోగోన్నతి దక్కని సీనియార్టీలో మొదట ఉన్న ఉద్యోగి తనకు జరిగిన అన్యాయాన్ని ఉన్నతాధికారులు, కలెక్టర్, మున్సిపల్ ఆర్డీ, కమిషనర్‌కు లేఖల ద్వారా తెలియజేశారు. న్యాయం చేయాలని పలుమార్లు కోరినా ప్రయోజనం దక్కలేదు. దీంతో బాధిత ఉద్యోగి న్యాయం కోరుతూ హైకోర్టు తలుపులు తట్టారు. ఉద్యోగోన్నతి విషయంలో తనకు జరిగిన అన్యాయాన్ని సాక్షాధారాలతో సహా హైకోర్టుకు సమర్పించారు. వీటిని పరిశీలించిన హైకోర్టు ఆ ఉద్యోగి పక్షాన తీర్పును వెలువరించింది. నిబంధనలకు విరుద్ధంగా చేసిన ఉద్యోగోన్నతిపై మున్సిపల్ పరిపాలన డైరెక్టర్, మున్సిపల్ ఆర్డీకి హైకోర్టు అక్షింతలు వేసింది. తక్షణం అడ్డగోలు ఉద్యోగోన్నతిని రద్దుచేసి, సదరు ఉద్యోగికి రివర్షన్ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు ఆదేశాలతో మున్సిపల్ అధికారులు దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు. మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్ ఆర్‌డి కార్పొరేషన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అడ్డగోలుగా ఇచ్చిన ఉద్యోగోన్నతిని రద్దుచేసి అతని రివర్షన్ చేసేలా ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు కమిషనర్ బాలస్వామి ఈ ఆదేశాలను వెంటనే అమలు చేసి సమాచారాన్ని సంబంధిత ఉన్నతాధికారులకు పంపారు. ఈ మొత్తం వ్యవహారంలో హైకోర్టు జోక్యం చేసుకుని అడ్డగోలు పదోన్నతిని రద్దు చేసినట్లు అయ్యింది. హైకోర్టు జోక్యం లేకుంటే తాము చేసిందే చట్టం అన్న విధంగా కార్పొరేషన్ అధికారుల వ్యవహారం ఉండేది. అయితే నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగోన్నతి కల్పించిన అధికారులపై మాత్రం ఇప్పటికీ చర్యలు తీసుకున్న దాఖలాలు మాత్రం లేవు.

ఇటీవల కార్పొరేషన్‌లో నకిలీ డీజిల్ కంటింజెంట్ బిల్లుల వ్యవహారం పెను దుమారం చేపింది. నకిలీ బిల్లులు సష్టించి సొమ్ము చేసుకుంటున్న వైనం విభాగపు ఉన్నతాధికారి తనిఖీలో వెల్లడైంది. ఉన్నతాధికారి అప్రమత్తతతో ఈ అడ్డగోలు వ్యవహారం వెలుగు చూసింది. చిన్నచిన్న పనులకు రూ.20వేలు వ్యయం కాగా వాటికి లక్ష రూపాయల కంటింజెంట్ బిల్లు పెట్టి అక్రమార్కులు సొమ్ము చేసుకున్నారన్న చర్చ ఉద్యోగుల్లో నడుస్తోంది. దాదాపు మూడు కోట్ల రూపాయల వరకు అడ్డగోలుగా కంటింజెంట్ బిల్లులు సొమ్ము చేసుకుని ఉంటారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఈ లెక్కను చూస్తే కార్పొరేషన్‌లో అందిన కాడికి ప్రజాధనం దోచుకోవటమే పరమావధిగా కొంతమంది వ్యక్తులు, అధికారులు వ్యవహరిస్తున్నారనే అభిప్రాయం ఉద్యోగ వర్గాలలో వ్యక్తం అవుతోంది. ఈ స్థాయిలో నిధులను పక్కదారి పట్టిస్తూ పారిశుధ్య కార్మికులకు అవసరమైన పారలు పలకలు, గంపలు తదితర పరికరాలు అడిగితే మాత్రం డబ్బుల్లేవంటూ అధికారులు చేతులెత్తేస్తుండడం విశేషం.

నగరంలో అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణకు ఉద్దేశించిన బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్‌లో సైతం కొంతమంది నేతలు సొమ్ము చేసుకునే పనిలో పడ్డారు. నిబంధనల ప్రకారం గృహ యజమాని అక్రమ నిర్మాణాన్ని క్రమబద్ధీకరించుకోవటానికి లైసెన్స్ ఇంజినీర్లను కలిసి పదివేల రూపాయలు చెల్లించి అన్ని వివరాలతో ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. క్రమబద్ధీకరణకు ప్రభుత్వానికి ఎంత చెల్లించాలన్న ఫీజు వివరాలు ఆన్లైన్‌లోనే లభ్యమవుతాయి. ఇందుకు టౌన్ ప్లానింగ్ అధికారులను కలవాల్సిన అవసరం గృహ యజమానులకు లేదు. అయినా బిపిఎస్‌కు దరఖాస్తు చేసుకునే వారిని అధికార పార్టీ నేతలను కలిసిన తరువాతనే దరఖాస్తు చేసుకునేలా చూడాలని లైసెన్స్ ఇంజినీర్లకు కొందరు ఉద్యోగులు చెబుతుండటం గమనార్హం. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టి నేతలకు లబ్ధి చేకూర్చాలన్న తపన ఆ ఉద్యోగుల్లో కనిపిస్తుండడం విశేషం. ఇలా కార్పొరేషన్‌లో జరుగుతున్న ఈ వ్యవహారాలన్నింటిపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపిస్తే మరిన్ని వాస్తవాలు బయటకు వచ్చే అవకాశం ఉందని పలువురు చర్చించుకుంటున్నారు.

అసాంఘిక కార్యకలాపాలను నిర్మూలిస్తాం

నూతన్ ఎస్ఐ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్ఐ జి.మహేష్

ప్రజాశక్తి-కుందుర్పి

మండలంలో అసాంఘిక శక్తుల ఆగడాలకు అడ్డుకట్ట వేయడానికి శకి_వంచన లేకుండా కృషి చేస్తానని ఎస్ఐ జి.మహేష్ తెలిపారు. ఆయన గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నూతన సబ్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలను ప్రోత్సహిం చినా, నిర్వహించినా కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు జరగుతుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు.

గతంలో కుందుర్పి ఎస్ఐగా పని చేసిన జి.నగేష్ కళ్యాణదుర్గం టౌన్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నూతన ఎస్ఐగా మహేష్ వచ్చారు. బాధ్యతలు చేపట్టిన ఎస్ఐకు కానిస్టేబుళ్లు శంకర్‌నాయక్, తిమ్మరాజు, బొమ్మయ్య, స్టేషన్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

వీధి దీపాల నిర్వహణలో నిర్లక్ష్యం..!

కొన్ని చోట్ల పగలూ వెలుగుతున్న లైట్లు - మరికొన్ని చోట్ల రాత్రివేళ చిమ్మచీకట్లు



పగలే వెలుగుతున్న విద్యుత్ బల్బు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం పట్టణంలో వీధి దీపాల విషయంలో విచిత్రమైన పరిస్థితి నెలకొంది. పట్టణంలో పలుచోట్ల పగలు సైతం వీధి దీపాలు వెలుగుతూ ఉండగా మరికొన్ని ప్రాంతాల్లో అసలు వీధి దీపాలే లేక రాత్రిళ్లు అంధకారం నెలకొంటుంది. ప్రధాంగా చాలా వీధుల్లో కొత్తగా లైట్లు ఏర్పాటు చేయగా వాటిని ఆఫ్ చేసే వారు లేక రోజంతా వెలుగుతూనే ఉన్నాయి. ఇక ప్రధాన రహదారుల్లో పలు చోట్ల లైట్లు వెలగక రాత్రివేళ చిమ్మచీకట్లు అలుముకున్నాయి. దీంతో రాత్రి వేళ పాదచారులు, ప్రయాణికులు, వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదివరకూ వీధి దీపాల నిర్వహణ బాధ్యత ప్రయివేటు ఏజెన్సీకి అప్పగించగా ఆ ఏజెన్సీతో ఇటీవల ఒప్పందం రద్దు అయింది. దీంతో అప్పటి నుంచి మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బంది నిర్వహణను పర్యవేక్షిస్తున్నారు. కొన్నిచోట్ల సాయంత్రం చీకటి పడిన వీధి దీపాలు ఆన్ చేయకపోవడం, పగలు పొద్దెక్కిపోయినా లైట్లను ఆఫ్ చేయకపోవడం జరుగుతోంది. ఇకనైనా మున్సిపల్ అధికారులు స్పందించి వీధి దీపాల నిర్వహణ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి ప్రజల ఇబ్బందులు తీర్చాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

అనంత మార్కెట్ యార్డ్‌ను అభివృద్ధి చేయండి

నూతన ఛైర్మన్ బల్లా పల్లవికి ఎమ్మెల్యే సూచన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం మార్కెట్ యార్డ్‌ను అభివృద్ధి పతంలో ముందుకు తీసుకెళ్లాలని నూతన ఛైర్‌పర్సన్ బల్లా పల్లవికి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు. అనంతపురం మార్కెట్ యార్డ్ ఛైర్‌పర్సన్‌గా నియమితులైన బల్లా పల్లవి ఆమె భర్త బల్లా సురేష్‌లు గురువారం నాడు అర్బన్ కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి భారీ గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మార్కెట్ యార్డ్ ద్వారా రైతులకు విశేష సేవలు అందించాలన్నారు. రైతులకు సేవ చేసే అవకాశం ఛైర్మన్ ద్వారా రావడానిన అదృష్టంగా భావించాలన్నారు. రైతులు అన్ని రకాల పంట ఉత్పత్తులను అమ్ముకునే విధంగా అన్ని ఏర్పాట్లు యార్డులో చేయాలన్నారు. మార్కెట్‌యార్డు ఛైర్మన్ బల్లా పల్లవి మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా యార్డు అభివృద్ధికి పనిచేస్తానన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో ముందుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సరిపుటి రమణ, మణికంఠ బాబు, నారాయణస్వామి యాదవ్, లక్ష్మీనాయుడమ్మ, పులబాషా తదితరులు పాల్గొన్నారు.



మార్కెట్‌యార్డు ఛైర్మన్ బల్లా పల్లవి, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు గజమాలతో అభిమానుల సన్మానం

చెరువులు నింపడంలో ప్రభుత్వం విఫలం

వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సాకే శైలజనాథ్

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలోని చెరువులకు సకాలంలో నీళ్లు ఇవ్వడంతో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీమంత్రి, వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్ గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. జగనన్న పాలనలో ప్రతి సంవత్సరం చెరువులో నీళ్లతో కళకలలాడుతూ మరువలు పారేవన్నారు. ప్రస్తుతం పాలకుల నిర్లక్ష్యం కారణంతో నీరు లేక వెలవెలబోతున్నాయన్నారు. గతంలో ప్రతి సంవత్సరం అక్టోబర్, నవంబర్ నెలల్లో సుబ్బరాయసాగర్ నుంచి నీరు విడుదల చేసి మండలంలోని చెరువులను నింపడం ఆనవాయితీ అన్నారు. అయితే ఈ సంవత్సరం డిసెంబర్ నెల ముగుస్తున్నా ఇప్పటికీ చెరువులకు చుక్క నీరు విడుదల చేయని దుస్థితి అని ఆవేదన వ్యక్తం చేశారు. సుబ్బరాయసాగర్ పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకున్నప్పటికీ, అధికారుల నిర్లక్ష్యంతో ముందస్తు చర్యలు తీసుకోకపోవడంతో షట్టర్లు మరమ్మతులకు గురై నీటిని విడుదల చేయలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఫలితంగా పుట్లూరు మండలంలోని పుట్లూరు, కోమటికుంట్ల, గరుగు చింతలపల్లి గ్రామాల చెరువులు పూర్తిగా ఎండిపోయి ప్రజలు తీవ్రమైన తాగునీటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. తాగునీటి అవసరాల కోసం దూర ప్రాంతాలకు వెళ్తున్నారన్నారు. సమస్యపై మండల రైతులు, ప్రజలు తనను కలిసి వివరించగా వారి తరపున నవంబర్ 11న హెచ్చెల్సీ ఎస్ఇకి వినతిపత్రం అందజేశామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి సుబ్బరాయసాగర్ నుంచి చెరువులకు నీటి సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజల ఆగ్రహం ఉద్యమాల రూపంలో బలపడే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి-యాడికి

మండలంలోని రాయలచెరువు గ్రామంలో బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి సహకారంతో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి మెగా వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు లక్ష్మీనారాయణశెట్టి మాట్లాడుతూ ప్రతినెలా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా సుమారు 40 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 15 మందికి ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు కంటి వైద్య నిపుణులు తెలిపారు. అనంతరం వైద్య శిబిరానికి వచ్చిన వారికి అల్లాబకాష్ భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ అల్లా ప్రకాష్, సత్యనారాయణ, రంజిత్‌కుమార్, ఎల్ఐసి ప్రసాద్, ఇస్మాయిల్, రవికుమార్‌రెడ్డి, ఎస్‌బిఐ రాజు, సూర్యనారాయణ, న్యూ వికాస్ స్కూల్ అధినేత రామకృష్ణ, రాజశేఖర్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం..!

పోతురాజుకాలువ గ్రామ రహదారిలో పెద్ద గొయ్యి-పట్టించుకోని అధికారులు-ఆందోళనలో ప్రజలు

ప్రజాశక్తి-శింగనమల

మండల పరిధిలోని పోతురాజుకాలువ గ్రామంలోని నడి ఊరిలో పెద్ద గోతి ఏర్పడింది. దీంతో గుంతలో ఎప్పుడే ప్రమాదం సంభవిస్తుందో అని స్థానికులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీసీ రోడ్డు పగిలిపోయి దాదాపు మూడు అడుగుల లోతు గుంత ఏర్పడింది. మండలంలోని రాచేపల్లి సమీపంలోని నది నుంచి సోదనపల్లి, పోతురాజుకాలువ మీదుగా అక్రమంగా ఇసుక తరలిస్తున్న పెద్ద పెద్ద టిప్పర్లు, ట్రాక్టర్లు అధిక లోడుతో తిరుగుతుండటంతో గోతి ఏర్పడిందని స్థానికులు చెబుతున్నారు. వాహనదారులు స్పీడుగా వచ్చి గుంతల్లో తిగితే ఏమైనా జరగవచ్చని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంతే గుంతకు చుట్టూ ఇళ్లు ఉన్నాయి. దీనికితోడు గుంత పక్కనే అంగన్వాడీ కేంద్రం ఉంది. అంగన్వాడీ కేంద్రానికి చిన్న పిల్లలు వెళ్తూ ఉంటారు. ఈనేపథ్యంలో గుంతలో ప్రమాదం జరిగితే ప్రమాదానికి గురైన వాహనం ఏ ఇంట్లోకైనా వెళ్లవచ్చు. దీంతో ఎప్పుడేం ప్రమాదం వస్తుందో అని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవిస్తున్నామని చుట్టుపక్కల నివాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి గుంతను పూడ్చడంతోపాటు రోడ్డు వేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.



పోతురాజుకాలువ నడి గ్రామంలో ఏర్పడిన పెద్ద గొయ్యి

భయంగా ఉంది..



ఊరి మధ్యలో పెద్ద గుంత ఏర్పడటంతో ఎప్పుడేం జరుగుతోందో అని భయంగా ఉంది. రాచేపల్లి గ్రామం పెన్నానది నుంచి టిప్పర్లు అక్రమంగా.. అధిక లోడుతో ఇసుక తరలిస్తుండటంతో ఈ పరిస్థితి ఏర్పడింది. గుంత ఉన్నట్లు తెలియని కొందరు వాహనదారులు వేగంగా వచ్చి ఇబ్బంది పడుతున్నారు. గుంత ఉన్నట్లు అటు ప్రజాప్రతినిధులు, ఇటు అధికారులకు తెలిసినా పట్టించుకోలేదు.

రామసుబ్బయ్య, రైతు, పోతురాజుకాలువ

ఇసుక వాహనాలను అరిట్టాలి



రాచేపల్లి గ్రామం పెన్నానది నుంచి మా గ్రామం మీదుగా రేయింబవళ్లు ఇసుక టిప్పర్లు, ట్రాక్టర్ల తిరుగుతుండటంతో గుంతలు ఏర్పడుతున్నాయి. సిసి రోడ్డు మొత్తం పగిలి చిన్నపాటి గుంతగా ఏర్పడి.. ఇప్పుడు పెనుప్రమాదం సంభవించే పెద్ద గుంతగా ఏర్పడింది. ఈ రోడ్డు వెంబడి నిత్యం గ్రామస్తులు, పిల్లలు, ద్విచక్ర వాహనదారులు తిరుగుతూ ఉంటారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గుంతను పూడ్చాలి.

నాగరాజు, పోతురాజుకాలువ



బహుమతులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్

మాజీ ఎమ్మెల్యే ఇంట్లో క్రిస్మస్ సందడి

ప్రజాశక్తి-గుంతకల్లు

టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్రగౌడ్ ఇంట్లో గురువారం క్రిస్మస్ పండుగ సందడి నెలకొంది. క్రైస్తవ సోదరులు శాంటా తాత వేషధారణలో మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్ ఇంటికి వెళ్లి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కోసం పంచిపెట్టారు. అనంతరం జితేంద్రగౌడ్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు జననం ప్రజలందరిలో క్షమాగుణం ఐక్యత ప్రేమ దయాకర్ణ దాతృత్వానికి నిదర్శనమన్నారు. క్రిస్మస్ పండుగ ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి యువ నాయకుడు ఆర్ అనిల్ గౌడ్, క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.

గుత్తి ఎస్‌ఐగా అమీర్‌ఖాన్

ప్రజాశక్తి-గుత్తి

గుత్తి సబ్‌ఇన్స్‌పెక్టర్–2గా అమీర్‌ఖాన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. విడపనకల్లు పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా ట్రైనింగ్ పూర్తి చేసుకున్న ఆయన బదిలీపై గుత్తికి వచ్చి బాధ్యతలు చేపట్టారు. ముందుగా సిఐ ఎం.రామారావును మర్యాదపూర్వకంగా కలిశారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఎస్‌ఐ అమీర్‌ఖాన్ తెలిపారు.



సిఐకి బొకే అందజేస్తున్న ఎస్ఐ

టిడిపి జిల్లా ఉపాధ్యక్షులుగా ఎస్.బర్దివలి



ప్రజాశక్తి-గుత్తి

టిడిపి పార్లమెంట్ ఉపాధ్యక్షులుగా గుత్తికి చెందిన షేక్ బర్దివలి నియమతులయ్యారు. మండలంలోని బేతాపల్లి గ్రామానికి చెందిన బర్దివలి గతంలో ఐదు సార్లు టిడిపి మండల కన్వీనర్ గా పనిచేశారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా వ్యవహరిస్తుండడంతో ఆయనను అధిష్టానం పార్లమెంట్ ఉపాధ్యక్షులుగా నియమించారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఆయన నియామకం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

వృద్ధురాలికి శస్త్రచికిత్స

ప్రజాశక్తి-గుంతకల్లు

వైద్య పరీక్షల పొందిన సిఐటియు కాలనీకి చెందిన బోయ సుంకమ్మకు స్థానిక ప్రభుత్వ వైద్యులు శ్రీనివాస్‌యాదవ్ గురువారం శస్త్ర చికిత్స చేసి కడుపులోని గడ్డను తొలగించారు. స్థానిక సిఐటియు కాలనీలో గత ఆదివారం పీపుల్స్ హెల్త్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగాహెల్త్ క్యాంపులో సుంకమ్మకు శస్త్ర చికిత్స అవసరమని గుర్తించారు. దీంతో ప్రభుత్వ వైద్యశాలలో శస్త్ర చికిత్స చేశారు. ఈ సందర్భంగా సుంకమ్మ మాట్లాడుతూ పీపుల్స్ హెల్త్ సొసైటీ సహకారంతో ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్న తాను శస్త్ర చికిత్స చేయించుకున్నట్లు తెలిపారు. ఇందుకు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.



చికిత్స చేయించుకున్న సుంకమ్మ

పెద్దపప్పూరు ఎస్‌ఐగా చంద్రశేఖర్‌రెడ్డి



పెద్దపప్పూరు : మండల నూతన ఎస్‌ఐగా చంద్రశేఖర్‌రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న నాగేంద్రప్రసాద్ బదిలీపై వెళ్లడంతో చంద్రశేఖర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ అమానుల్లాతోపాటు పోలీస్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

'అనంత' సుందరీకరణకు అడుగులు

నగరపాలక సంస్థ ఉద్యానవన సహాయ సంచాలకులు లక్ష్మయ్య

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

రాష్ట్రంలోని అన్ని నగరాలతోపాటు అనంతపురానికి కూడా సుందరీకరణ దిశగా తీసుకెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని నగరపాలక సంస్థ ఉద్యానవన సహాయ సంచాలకులు లక్ష్మయ్య తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సహకారం, కార్పొరేషన్ కమిషనర్ సూచనలతో అనంతపురంలో ఉన్న పార్కులు, డివైడర్ మధ్య ఉన్న మొక్కలను ఆధునిక హంగులతో సుందరీకరణ చేసే దిశగా ఆలోచిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న వనరులను ఉపయోగించుకుని నగరాన్ని సుందరీ చేయనున్నట్లు తెలిపారు. తాను నగరపాలక సంస్థ సహాయ ఉద్యానవన సహాయ సంచాలకులుగా బాధ్యతలు చేపట్టిన వెంటనే నగరంలో ప్రజల వినియోగించే పార్కులను మరియు రోడ్డుకు మధ్యలో ఉన్న డివైడర్లు మధ్యలో మొక్కలను పరిశీలించి వాటిని ప్రజలందరికీ ఆహ్లాదకరం పంచే విధంగా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. అదేవిధంగా వివిధ కాలనీలో చెట్లను ఒక ఆర్డర్లో ఉండే విధంగా ట్రిమ్మింగ్ చేస్తున్నట్లు తెలిపారు. కాలనీలు, డివైడర్ల మధ్యలో ఉన్న మొక్కలను కత్తిరించినప్పుడు వచ్చే కొమ్మలను వేస్ట్‌గా పారేయకుండా వాటిని వుడ్‌కట్టర్ సాయంతో ఎరువుగా మార్చి చెట్లకు వినియోగిస్తున్నామన్నారు. కార్పొరేషన్ సిబ్బంది సహకారంతోనే ఇవన్నీ చేస్తున్నామన్నారు. అభివృద్ధి చెందుతున్న నగరాల్లో అనంతపురం ఒకటి అన్నారు. ఇందులో భాగంగానే అనంతపురాన్ని కూడా సుందరీకరణ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం దిశానిర్దేశం చేసిందన్నారు. తనకు పూర్తిస్థాయిలో అనంతపురం నగరపాలక సంస్థ రోడ్లపై, పార్కుపై, కాలనీలోని చెట్లపై పూర్తిస్థాయి అవగాహన ఉండటంతో సరైన ఆర్డర్‌లో ఉండే విధంగా కత్తిరిస్తున్నట్లు తెలిపారు. అనంతపురంలో ఇప్పటికే పొల్యూషన్ శాతం పెరిగి ఉన్నందున ఇక్కడ పర్యావరణాన్ని కాపాడేందుకు అవసరమైన పూలమొక్కలతో పాటు చెట్లు, ఇళ్ల, కార్యాలయాల వద్ద బాధ్యతగా మొక్కలను నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. ప్రజలకు ఉద్యానవనాలు మొక్కలు పెంపుదలకు తమవంతు సహాయ సహకారం అనంతపురం నగరపాలక సంస్థ నుంచి అందించేందుకు కృషి చేస్తామన్నారు.



చెట్ల కత్తిరింపును పర్యవేక్షిస్తున్న నగరపాలక సంస్థ ఉద్యానవన సహాయ సంచాలకులు లక్ష్మయ్య

రుచి, శుచికి కేరాఫ్.. లక్కీ-6 టిఫిన్ సెంటర్

వేల్పుమడుగు రామాంజి రాయల్

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురంతోపాటు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు రుచి సుచికరమైన అల్పాహారానికి నగరంలోని లక్కీ–6 టిఫిన్ సెంటర్ నిలయంగా మారింది. వేల్పుమడుగుకు చెందిన రామాంజి రాయల్ దాదాపు 14 ఏళ్ల క్రితం లక్కీ–6 పేరుతో నగరంలోని కమలానగర్‌లో టిఫిన్ సెంటర్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు అల్పాహారం అందిస్తున్నారు. స్వచ్ఛమైన, నాణ్యంగా రుచికరమైన అల్పాహారం అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో రామాంజి రాయల్ మాట్లాడుతూ తమది రైతు కుటుంబం అన్నారు. నగరానికి వచ్చే ప్రజలు, చిరుద్యోగులకు అన్నిరకాల రుచికరమైన శాఖాహార అల్పాహారం అందిస్తున్నట్లు తెలిపారు. ఉదయం సాయంత్రం వేళల్లో అన్ని రకాల టిఫిన్స్‌తో పాటు ఫాస్ట్‌ఫుడ్స్ తయారు చేస్తున్నట్లు తెలిపారు. తమ కస్టమర్లకు రుచికరమైన అల్పాహారంతో పాటు మట్టికుండలో ప్యూరిఫైడ్ వాటర్‌ను అందుబాటులో ఉంచుతున్నట్లు వివరించారు. అందరూ నచ్చి మెచ్చి తినేలా ఆహార పదార్థాలు ఉండడంతో 14 ఏళ్లుగా ప్రజలు తమ లక్కీ–6 టిఫిన్ సెంటర్ ఆదరిస్తున్నారన్నారు. ప్రజలు మరింత సౌకర్యవంతంగా ఉండటం కోసం ఆధునిక హంగులతో లక్కీ–6 టిఫెన్స్ సెంటర్‌ను ప్రస్తుత ట్రెండ్‌కు అనుగుణంగా అధునీకరించినట్లు వివరించారు. తమ టిఫిన్ సెంటర్ ద్వారా స్వశక్తితో ఉపాధి పొందటం పాటు మరో 8 మందికి ఉపాధి కల్పిస్తుంచడం తనకు ఎంతో ఆనందాన్ని ఇస్తోందన్నారు.



నగరంలోని లక్కీ-6 టిఫిన్ సెంటర్, ఏర్పాటు చేసిన కుండనీరు, రామాంజి రాయల్

జెరూసలేం యాత్రకు సహకరిస్తా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం అర్బన్ నియోజకవర్గం నుంచి జెరూసలేం యాత్రకు వెళ్లే క్రైస్తవులకు తనవంతుగా సాయం చేస్తానని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. అనంతపురంలోని పలు చర్చిల్లో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముందుగా అరవింద్ నగర్‌లోని సీఎస్ఐ,తర్వాత సప్తగిరి సర్కిల్లోని ఎస్ఐయూ చర్చి, కోర్టు రోడ్డులోని గ్లాష్ పాల్ చర్చి, రాయల్ ఫంక్షన్ వద్ద ఏజి చర్చి, ఏఎండీ ఫంక్షన్ హాల్ వద్ద ఉన్న కల్వరి గ్రేస్ చర్చి, చంద్రబాబు నగర్ లోని కల్వరి చర్చిల్లో ఎమ్మెల్యేతోపాటు మార్కెట్ యార్డు ఛైర్‌పర్సన్ బల్లా పల్లవి, టిడిపి నాయకులు పాల్గొని ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ గతం కంటే ఎక్కువ సంతోషంతో ఈసారి క్రిస్మస్ పండుగ జరుగుతోందన్నారు. దీనికి కారణం గత 12 నెలలుగా పాస్టర్లకు పెండింగ్ లో ఉన్న గౌరవ వేతనాలు విడుదల చేయడమేనన్నారు. ఒక్కొక్క పాస్టర్‌కు రూ.60వేల గౌరవ వేతనం క్రిస్మస్‌కు ఒకరోజు ముందే అందిందన్నారు. రాష్ట్రంలో 8400 మందికి పైగా దీని ద్వారా లబ్ధి జరిగిందన్నారు. ఇదే కాకుండా జెరూసలేం యాత్రకు రూ.60వేల వరకు ప్రభుత్వం సాయం చేస్తోందన్నారు. తాను క్రిస్టియన్ అని చెప్పుకునే జగన్మోహన్‌రెడ్డి ఏ రోజైనా క్రైస్తవుల గురించి ఆలోచించారా అని నిలదీశారు. కనీసం పాస్టర్లకు కూడా గౌరవ వేతనం ఇవ్వలేకపోయారన్నారు. క్రైస్తవులను జగన్మోహన్‌రెడ్డి మోసం చేస్తే.. ముఖ్యమంత్రి చంద్రబాబు వారికి అన్ని విధాలుగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అందిస్తున్నారన్నారు. గతంలో గుంటూరులో రూ.16 కోట్లతో గత టిడిపి ప్రభుత్వంలో చర్చి నిర్మాణం చేపడితే అది వైసీపీ ప్రభుత్వంలో ఆగిపోయిందన్నారు. ఇప్పుడు మరోసారి కూటమి ప్రభుత్వంలో 10 కోట్లు విడుదల చేసి చర్చి నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గం నుంచి జెరూసలేం యాత్రకు వెళ్లే వారికి విమానాలకు అయ్యే ఖర్చులు తాను ఇస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాస్, టిడిపి నాయకులు కొనంకి గంగారామ్, మాజీ కార్పొరేటర్ సరిపుటి రమణ, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహ, టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఫిరోజ్‌అహ్మద్, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు తొండపునాటి రమేష్, డైరెక్టర్లు పరమేష్, కడియాల కొండన్న, టిడిపి నాయకులు రాయల్ మధు, నెట్టెం బాలకృష్ణ, చేపల హరి, జోగేంద్ర, కేశవ నాయుడు, ఓంకార్ రెడ్డి, బోయపాటి బాలప్ప, కృష్ణం రఘు, భక్తవత్సలం నాయుడు, కదిరప్ప తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

నేరాలు ఘోరాలు

వ్యక్తి ఆత్మహత్య

తాడిపత్రి రూరల్ : రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం రూరల్ పరిధిలోని చల్లవారిపల్లి గ్రామ సమీపంలో రైల్వే ట్రాక్‌పై చోటు చేసుకుంది. మండల పరిధిలోని చల్లవారిపల్లి సమీపంలో రైల్వేపట్టాలపై మృతదేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో రైల్వే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై విచారణ చేస్తున్నట్టు రైల్వే పోలీసులు తెలిపారు.

మోటార్ల కేబుల్ వైరు చోరీ



ధ్వంసమైన మోటారు

పుట్లూరు : మండల పరిధిలోని కడవకల్లు, ఓబులాపురం గ్రామానికి చెందిన రైతుల మోటార్ల కేబుల్ వైర్లు చోరీకి గురైనట్లు బాధిత రైతులు వాపోయారు. కడవకల్లు గ్రామంలో రమేష్‌రెడ్డికి చెందిన నాలుగు మోటర్లకు సంబంధించి 100 మీటర్ల కేబుల్ చోరీ అయినట్లు తెలిపారు. అలాగే నరసింహారెడ్డిది ఐదు మోటర్లు కేబుల్ వైరు, అశ్వర్థ, ఓబులాపురం శీనుకు చెందిన రెండు మోటార్ల కేబుల్ వైరు, లక్ష్మీ నరసింహ తదితర రైతులకు సంబంధించి సుమారు 300 మీటర్ల వరకూ కేబుల్ వైర్లు చోరీకి గురైనట్లు తెలిపారు. ఆయా రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

'కోవెలమూడి'ని కలిసిన జిల్లా టిడిపి నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

గుంటూరు మేయర్, టిడిపి కోఆర్డినేషన్ సభ్యులు కోవెలమూడి నానిని ఆయన క్యాంపు కార్యాలయంలో అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ నూతన అధ్యక్షులు పూల నాగరాజు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్చం అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, ఇతర టిడిపి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



కోవెలమూడి నానితో జిల్లా టిడిపి నాయకులు

జిల్లావ్యాప్తంగా పోలీసుల తనిఖీలు

ప్రజాశక్తి-అనంతపురం

ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా పోలీసులు వేకువజాము నుంచే కార్డెన్‌సెర్చ్ ఆపరేషన్‌లు నిర్వహించారు. ముఖ్యంగా సమస్యాత్మక గ్రామాలు, కాలనీల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. డీఎస్పీల పర్యవేక్షణలో సీఐలు, ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో రౌడీషీటర్లు, పాత కేసుల్లో నిందితులు, ట్రబుల్ మాంగర్స్, అనుమానితుల ఇళ్లలో విస్తృతంగా చెకింగ్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా పశువుల పాకలు, గడ్డివాము ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ, ఇతర రాష్ట్రాల మద్యం, నాటుసారా, గుట్కా వంటి అక్రమ కార్యకలాపాలపై ప్రత్యేక కృష్టి సారించి తనిఖీలు నిర్వహించారు. అనంతరం గ్రామసభలు నిర్వహించి ప్రజలు ప్రశాంతంగా జీవించాలని సూచించారు. ఎలాంటి అల్లర్లు, గొడవలకు వెళ్లకూడదని కోరారు. మట్కా, పేకాట తదితర అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని అవగాహన కల్పించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించినా, అల్లర్లకు ప్రేరేపించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



అనుమానితుల ఇంటిని సోదా చేస్తున్న పోలీసులు

పల్లెనిద్రలు

శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లావ్యాప్తంగా పోలీసులు గత రాత్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక గ్రామాల్లో పల్లె నిద్రలు చేపట్టారు. అనంతరం ఉదయం మహిళల భద్రత, శక్తియాప్ ఉపయోగాలు, సైబర్ నేరాలపై ముందస్తు జాగ్రత్తలు, గంజాయి వాడకం వల్ల కలిగే అనర్థాలు, రోడ్డు ప్రమాదాల నియంత్రణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. జిల్లావ్యాప్తంగా శాంతియుత వాతావరణం కొనసాగించడమే లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు తెలిపారు.



తాడిపత్రి మండలంలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

తాడిపత్రి రూరల్ : తాడిపత్రి రూరల్ అప్‌డేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నంద్యాల రోడ్డు చుక్కలూరు క్రాస్ సమీపంలో రూరల్ పోలీసులు గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా లైసెన్సులు, హెల్మెట్లు లేకుండా వాహనాలు నడిపే వారికి జరిమానాలు విధించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా వాహనం నడిపేటప్పుడు కచ్చితంగా లైసెన్స్ కలిగి ఉండి హెల్మెట్ ధరించాలన్నారు. కారు నడిపేటప్పుడు సీట్ బెల్ట్ ధరించాలని వాహనదారులకు రూరల్ సీఐ శివగంగాధర్ రెడ్డి సూచించారు.


సీతారాం ఏచూరికాలనీలో కేక్ కోస్తున్న ఐద్వా మహిళలు


రాయదుర్గంలో పాస్టర్లకు కేక్ తినిపిస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు


యల్లనూరులో చీరలు పంపిణీ చేస్తున్న పాస్టర్ బాబు

ఘనంగా క్రిస్మస్ వేడుకలు


రాచానపల్లిలో కేక్ కోస్తున్న పాస్టర్, చిన్నారులు

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఉన్న చర్చిలో గురువారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ పి.జగదీష్ కేక్ కోసం పంచిపెట్టారు. అనంతరం క్రైస్తవులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ బాషా, ఆర్ఐలు పవన్‌కుమార్, చర్చి కమిటీ సభ్యులు సిఐ సుబ్బరాయుడు, హెడ్ కానిస్టేబుల్ ప్రకాష్, కానిస్టేబుళ్ల ఈశ్వర్, ప్రవీణ్, రాజారత్నం, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, సుధాకర్‌రెడ్డి, గాండ్ల హరినాథ్, ఫాస్టర్ వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

అలాగే నగరంలోని సరోజినీ రోడ్డులో ఉన్న లోటస్ కిడ్స్ ఇంటర్నేషనల్ అమెరికన్ పాఠశాలలో గురువారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు క్రిస్మస్ గొప్పదనాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నిర్మల ఆనంద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అలాగే అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి పంచాయతీలోని యేసు కృపా మందిరంలో సంఘ కాపరి నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కేక్ కోసం పంచిపెట్టారు. లీనా డేబోరా, డి నా జాయిస్ ఆరాధన చేశారు. అనంతరం దుస్తులు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పాస్టర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు నెహెమ్యా రెడ్డివారి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో..

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో స్థానిక సీతారాం ఏచూరి కాలనీలో గురువారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా క్రిస్మస్ గీతాలు ఆలపించారు. తర్వాత కేక్ కోసం పంచిపెట్టారు. ముఖ్యంగా మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐద్వా నగర కార్యదర్శి అశ్విని,కోశాధికారి గీత మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ యొక్క అసలైన సందేశమైన ప్రేమ, శాంతి, సోదర భావం, సమానత్వం,సమాజంలో పెరుగుతున్న అసమానతలు వివక్షలకు వ్యతిరేకంగా ఐక్యంగా నిలబడాల్సిన అవసరం ఉందని తెలిపారు. కాలనీలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు,మౌలిక వసతుల లోపాలు, జీవన భద్రత అంశాలపై చర్చ జరిగిందని, మహిళల హక్కులు,భద్రత, సమాన అవకాశాల కోసం ఐద్వా నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ క్రిస్మస్ వేడుకలు కాలనీలోని ఐక్యతను, సౌహార్ద్యాన్ని మరింత బలపరిచాయని వివరించారు. ఈ కార్యక్రమంలో నగర కమిటీ సభ్యులు పద్మావతి, విజయలక్ష్మి, అరుణ, మాధవి, కళావతి, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మండల కేంద్రంలోని ఎరుషలేము, కృపాకర్, శాలెం, జీవనది బైబిల్ మిషన్, బేరాక్ ప్రార్థనా మందిరం చర్చిలతోపాటు మండలవ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా పాస్టర్స్ పాల్ డేవిడ్, సదానందం, మహారాజ్, జాన్ ఆకుల్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

శింగనమల : మండలవ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా ఆయా చర్చిల్లో కేక్‌లు కోసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా పాస్టర్లు క్రిస్మస్ సందేశాన్ని చదివి వినిపించారు. తర్వాత అన్నదానాలు చేశారు. ఈ కార్యక్రమాల్లో చర్చి ఫాదర్లు, క్రైస్తవులు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : భువినుంచి దివికేగిన ఏసుబోధనలు ప్రతి ఒక్కరూ మరవరాదని పాస్టర్ జాన్డేవిడ్ సూచించారు. క్రిస్మస్ వేడుకల్లో భాగంగా పెద్దవడుగూరులోని ఐఎస్ఇసి చర్చిలో గురువారం జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రేమభావాన్ని, సేవతత్పరత, కరుణ, ధాతృత్వం, త్యాగం అన్నింటిని మానవాళికి ఏసు అందించిన మహోన్నతమైన సందేశాలని తెలిపారు. అనంతరం ఏసు జననం పలు అంశాలపై తెలియజేసి కేక్‌లుకోసం పంచారు. అలాగే చిన్నవడుగూరు, దిమ్మగుడి, చిత్రచేడు, రావులుడికి, క్రిష్టిపాడు, లక్షుంపల్లి, విరుపాపురం, గుత్తిఅనంతపురం, కొండూరు, వీరన్నపల్లి, కండ్లగూడూరు, వెంకటాంపల్లి తదితర గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి.

యల్లనూరు : మండలంలోని వివిధ గ్రామాల చర్చిల్లో గురువారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇందులో భాగంగా క్రీస్తు జీవిత విశేషాలను వివరించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని జీషస్ గ్లోరి చర్చిలో పాస్టర్ బాబు మహిళలకు చీరలు పంపిణీ చేశారు. తర్వాత అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు.

రాయదుర్గం : క్రీస్తు బోధనలు ఆచరణీయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. క్రిస్మస్ సందర్భంగా పట్టణంలోని యేసయ్యా మిరాకిల్ చర్చిలో గురువారం నిర్వహించిన వేడుకల్లో కాలవ పాల్గొని కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ లేని దానికోసం ఆలోచిస్తూ అసూయ, ఈర్షా ద్వేషాలు పెంచుకుంటూ జీవితాన్ని కష్టమయం చేసుకోవడం కంటే ఉన్న దాంట్లో సంతృప్తిగా జీవనాన్ని కొనసాగించడం ఎంతో ఆనందాన్ని ఇస్తుందన్నారు. క్రీస్తు జీవితం మానవాళికి ఓ గొప్ప సందేశం అన్నారు. మదర్ థెరెసా జీవనం అందరికీ ఆదర్శప్రాయమన్నారు. అనేక అంశాలతో ఇమిడి ఉన్న క్రీస్తు బోధనలో కనీసం 20, 30 శాతం మన నిజ జీవితంలో పాటించగలిగితే మన జీవితం ఎంతో సుఖవంతంగా ముందుకు సాగిపోతుందన్నారు. క్రైస్తవులకు కాలవ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి పసుపులేటి నాగరాజు, ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పురుషోత్తం, నాయకులు ఇనాయత్, చిన్నికృష్ణ, మల్లి, క్రైస్తవులు పాల్గొన్నారు.

రాయదుర్గం పట్టణంలోని రాజీవ్‌గాంధీకాలనీలో ఉన్న కింగ్ ఆఫ్ షాలేమ్ క్రైస్ట్ చర్చిలో పాస్టర్ జె.కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. క్రైస్తవులు పెద్దఎత్తున పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ క్రీస్తు జననం, క్రిస్మస్ సందేశాన్ని వినిపించారు. యువతీ, యువకులు క్రీస్తు పాటలు ఆలపించారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. చర్చి సభ్యులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. చివరగా పేద మహిళలకు ఉచితంగా చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చర్చి అభివృద్ధి మండలి సభ్యులు రాజశేఖర్, మురళి, చిన్నబాబు, రామాంజి, రాజన్న, యూత్ సభ్యులు రెడ్డి జగదీష్, ఈశ్వర్, ప్రతాప్, చరణ్, వంశీ, వివిధ ప్రాంతాల క్రైస్తవులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : మండల పరిధిలోని బొమ్మనహాల్, శ్రీధరఘట్ట, ఉద్దేహాల్, గోవిందవాడ, దర్గాహొన్నూరు, కుర వల్లి, నేమకల్లు, శ్రీరంగాపురం, గోనేహాల్, హరేసముద్రం, లింగదహాల్, సింగానహల్లి, దేవగిరి, బండూ రు, కళు దేవనహళ్లి, పలు గ్రామాల్లో క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులు బుధవారం అర్ధరాత్రి నుంచే చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గురువారం ఉదయం పాస్టర్లు క్రీస్తు జననం, బోధనలు, క్రిస్మస్ ప్రాధాన్యతను వివరించారు. ప్రార్థనల అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

కుందుర్పి : మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రముఖులు మాట్లాడుతూ క్రీస్తు జీవితం ఆచరణీయం, ఆదర్శప్రాయమన్నారు. ప్రతి ఒక్కరూ శాంతిని కోరుకోవా లన్నారు. అన్ని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు క్రీస్తు జననం, బోధనలను వినిపించారు. ఎనుములదొడ్డి విక్టరీ ప్రార్థనా మందిరంలో పార్టీలకు అతీతంగా ప్రార్థనలు చేసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ హనుమంతరాయుడు, సర్పంచులు మారుతీశ్వరి రామ్మూర్తి, మహదేవమ్మ,


పెద్దవడుగూరులో కేక్ కోస్తున్న పాస్టర్, చిన్నారులు

నాయకులు విజయకుమార్, తిప్పేస్వామి, నాగరాజు, ఆనంద్, కెఎల్.ప్రసాద్, వి.హనుమంతరాయుడు, ప్రభాకర్, తిమ్మరాయుడు, రామాంజనేయులు, పాస్టర్ అజర్యా, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : క్రీస్తు బోధనలు ఆచరణీయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. క్రిస్మస్ సందర్భంగా పట్టణంలోని యేసయ్యా మిరాకిల్ చర్చిలో గురువారం నిర్వహించిన వేడుకల్లో కాలవ పాల్గొని కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ లేని దానికోసం ఆలోచిస్తూ అసూయ, ఈర్షా ద్వేషాలు పెంచుకుంటూ జీవితాన్ని కష్టమయం చేసుకోవడం కంటే ఉన్న దాంట్లో సంతృప్తిగా జీవనాన్ని కొనసాగించడం ఎంతో ఆనందాన్ని ఇస్తుందన్నారు. క్రీస్తు జీవితం మానవాళికి ఓ గొప్ప సందేశం అన్నారు. మదర్ థెరెసా జీవనం అందరికీ ఆదర్శప్రాయమన్నారు. అనేక అంశాలతో ఇమిడి ఉన్న క్రీస్తు బోధనలో కనీసం 20, 30 శాతం మన నిజ జీవితంలో పాటించగలిగితే మన జీవితం ఎంతో సుఖవంతంగా ముందుకు సాగిపోతుందన్నారు. క్రైస్తవులకు కాలవ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి పసుపులేటి నాగరాజు, ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పురుషోత్తం, నాయకులు ఇనాయత్, చిన్నికృష్ణ, మల్లి, క్రైస్తవులు పాల్గొన్నారు.

రాయదుర్గం పట్టణంలోని రాజీవ్‌గాంధీకాలనీలో ఉన్న కింగ్ ఆఫ్ షాలేమ్ క్రైస్ట్ చర్చిలో పాస్టర్ జె.కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. క్రైస్తవులు పెద్దఎత్తున పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ క్రీస్తు జననం, క్రిస్మస్ సందేశాన్ని వినిపించారు. యువతీ, యువకులు క్రీస్తు పాటలు ఆలపించారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. చర్చి సభ్యులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. చివరగా పేద మహిళలకు ఉచితంగా చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చర్చి అభివృద్ధి మండలి సభ్యులు రాజశేఖర్, మురళి, చిన్నబాబు, రామాంజి, రాజన్న, యూత్ సభ్యులు రెడ్డి జగదీష్, ఈశ్వర్, ప్రతాప్, చరణ్, వంశీ, వివిధ ప్రాంతాల క్రైస్తవులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : మండల పరిధిలోని బొమ్మనహాల్, శ్రీధరఘట్ట, ఉద్దేహాల్, గోవిందవాడ, దర్గాహొన్నూరు, కుర వల్లి, నేమకల్లు, శ్రీరంగాపురం, గోనేహాల్, హరేసముద్రం, లింగదహాల్, సింగానహల్లి, దేవగిరి, బండూ రు, కళు దేవనహళ్లి, పలు గ్రామాల్లో క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులు బుధవారం అర్ధరాత్రి నుంచే చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గురువారం ఉదయం పాస్టర్లు క్రీస్తు జననం, బోధనలు, క్రిస్మస్ ప్రాధాన్యతను వివరించారు. ప్రార్థనల అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

కుందుర్పి : మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రముఖులు మాట్లాడుతూ క్రీస్తు జీవితం ఆచరణీయం, ఆదర్శప్రాయమన్నారు. ప్రతి ఒక్కరూ శాంతిని కోరుకోవా లన్నారు. అన్ని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు క్రీస్తు జననం, బోధనలను వినిపించారు. ఎనుములదొడ్డి విక్టరీ ప్రార్థనా మందిరంలో పార్టీలకు అతీతంగా ప్రార్థనలు చేసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ హనుమంతరాయుడు, సర్పంచులు మారుతీశ్వరి రామ్మూర్తి, మహదేవమ్మ, నాయకులు విజయకుమార్, తిప్పేస్వామి, నాగరాజు, ఆనంద్, కెఎల్.ప్రసాద్, వి.హనుమంతరాయుడు, ప్రభాకర్, తిమ్మరాయుడు, రామాంజనేయులు, పాస్టర్ అజర్యా, నరేష్ తదితరులు పాల్గొన్నారు.


లోటస్ కిడ్స్ పాఠశాలలో క్రిస్మస్ సంబరాలు


రాయదుర్గంలో కేక్ కోస్తున్న పాస్టర్, చిన్నారులు


కుందుర్పిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నా నాయకులు

పోషకాహారంపై అవగాహన

ప్రజాశక్తి-బెలుగుప్ప


పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న ఐసిడిఎస్ సూపర్‌వైజర్

వయసు తగ్గ బరువు, ఎత్తు లేని పిల్లలకు జిజిఎస్, ఎన్ఆర్‌సిలో పోషకాహారంపై తల్లులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రమాదేవి మాట్లాడుతూ బిడ్డ పుట్టినప్పుడు వయసుకు తగ్గ బరువు , ఎత్తు, పెరగకున్నప్పుడు అనంతపురం జిజిఎస్ ఎన్ఆర్‌సిలో అడ్మిట్ చేస్తే పిల్లలకు న్యూట్రిషన్ ఫుడ్‌తోపాటు బిడ్డ బరువు ఎలా పెంచాలని, ఆహార పద్ధతులను నేర్పిస్తారన్నారు. 14 రోజులపాటు అలవాట్లతో బిడ్డ బరువు ఎలా పెంచాలో నేర్పుతారన్నారు.

ప్రభుత్వ భూమిపై కబ్జాదారుల కన్ను

ప్రజాశక్తి -నంబులపూలకుంట

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ప్రభుత్వ భూమిపై కబ్జాదారులు కన్నేశారు. ప్రభుత్వ భూమిని ఆక్రమణదారులు ఆక్రమించుకొని అమాయకపు ప్రజలకు అమ్ముకుంటు లక్షల రూపాయల్లో సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. భూముల ధరలకు రెక్కలు రావడంతో ఇవి అక్రమార్కులకు వరంగా మారింది. ఇప్పటికే ముగ్గురకి అమ్మకాలు జరిగాయని పక్కన సర్వే నెంబర్ తో రిజిస్ట్రేషన్ చేశారని ఇందులో ఒక్కరు పునాది వేసుకొని పనులు ప్రారంభించారుజ ప్రభుత్వ భూమిని రెవిన్యూ అధికారులు పరిశీలించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి భవిష్యత్ లో నిరుపేదలకు ఇంటిపట్టాలు, ప్రభుత్వ భవనాలకు స్థలాలు ఉండేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై తహశీల్దార్ దేవేంద్రనాయక్ మాట్లాడుతూ రికార్డులు పరిశీలించి, అక్రమ పట్టాలు పొంది ఉంటే రద్దు చేస్తామని విక్రయాలు జరిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి - కొత్తచెరువు

మండల పరిధిలోని తలమర్ల గ్రామంలో బస్టాండ్ కూడలి నుంచి నాగిరెడ్డిపల్లి కి వెళ్లే తారు రోడ్డు వరకు మండల పరిషత్ నిధులు 16 లక్షల రూపాయలతో చేపడుతున్న సిసి రోడ్డు పనులను ఎంపీపీ గాయత్రి రెడ్డప్పరెడ్డి, సర్పంచి రత్నమ్మ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణానికి మండల గ్రాండ్ నుండి నిధులను మంజూరు చేశామని ఈ పనులను త్వరతిగతినం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సూరి తదితరులు పాల్గొన్నారు.

డయాలసిస్ సేవల మెరుగుకు చర్యలు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం పట్టణం లోని డయాలసిస్ కేంద్రాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి అభివద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ నరసింహులు, డాక్టర్ సోనియా, పుల్లయ్య తెలిపారు. ఈ సందర్భంగా వారు గురువారం పట్టణంలోని పోతుకుంట రోడ్డు వద్ద గల నూతన ఆసుపత్రి భవనములో డయాలసిస్ (రక్త శుద్ధి కేంద్రం) ప్రథమ వార్షికోత్సవ్వాన్ని రోగులు, సిబ్బంది ఆధ్వర్యంలో జరుపుకున్నారు. అనంతరం వారు డయాలసిస్ తో వైద్య చికిత్సలు అందుతున్న వారితో మాట్లాడి వైద్యం అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం డయాలసిస్ రోగులకు స్పందన ఆసుపత్రి డాక్టర్, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యురాలు డాక్టర్ సోనియా పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డయాలసిస్ హాస్పిటల్ మేనేజర్ మునీంద్ర ,టెక్నికల్ అసిస్టెంట్ వేణు, గణేష్, స్టాఫ్ నర్సు శిలీల, సరస్వతి, షాహిదా తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ

ప్రజాశక్తి కదిరి అర్బన్

ఈనెల 27,28 తేదీలలో జరగనున్నన ఇస్తేమా నేపథ్యంలో ఆ ప్రదేశాన్ని ఎస్పీ సతీష్ కుమార్ గురువారం పరిశీలించారు. ముస్లిం మత పెద్దలతో కలిసి ఇస్తామా ప్రదేశాన్ని పరిసర ప్రాంతాలను వాహనాల రాకపోకల అంశాలపై వారితో చర్చించారు. సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న మైనార్టీ సోదరులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఎస్పీ ఆదేశించారు. ఏమైనా అనుమానాలు ఉంటే పై అధికారులు కానీ సంబంధిత మత పెద్దలను అడిగి తెలుసుకోవాలన్నారు. ఇస్తేమాలో ఎవరికీ ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చర్యలు చేపడతామన్నారు. ఈకార్యక్రమంలో మైనార్టీ మత పెద్దలతో పాటు టిడిపి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, టిడిపి నాయకులు ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐను కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - అమడగూరు

స్థానిక పోలీస్ స్టేషన్ కు బదిలీపై వచ్చిన ఎస్ఐ గోపాల్‌కృష్ణను టిడిపి స్థానిక నాయకులు గురువారం కలిశారు. గురువారం పోలీస్ స్టేషన్లో ఎస్ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.ఈ సందర్భంగా టిడిపి మండల కన్వీనర్ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఎస్ఐ కోరారు.అలాగే మండలంలో వ్యవసాయ బోరుబావుల వద్ద విద్యుత్ ట్రాన్సఫార్మర్ లు దొంగతనాలు చేస్తున్నారని ఎస్ఐ ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు..అదేవిధంగా ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు.యువత మద్యం సేవిస్తున్నారని పటిష్టమైన భద్రత ఏర్పాటు చేయాలని ఎస్ఐని కోరారు.ఈ కార్యక్రమంలో సర్పంచి షబ్బీర్ బాషా, టిడిపి నాయకులు కుమార్ రెడ్డి, రాజారెడ్డి, వడ్డెర సంఘం అధ్యక్షులు దొనకొండ రమణప్ప,మంజుల లక్ష్మన్న,రమణ,కిష్టప్పటైలర్ రామాంజులు,నరసింహమూర్తి, మారుతీ,శంకర,హనుమంతు రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి రథోత్సవం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి బ్రహ్మరథోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఉదయం సుప్రభాత సేవతో పూజా కార్యక్రమాలను అర్చకులు ప్రారంభించారు. మూలవిరాట్ సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఆవరణలో హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి రథోత్సవాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమలో ఆలయ ధర్మకర్త మంజునాథ్, చంద్రశేఖర్, టిడిపి నాయకులు జెపికె రాము, ఎన్‌బికె రాజు, ఎంఎస్ మని, మల్లాపల్లి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వకలయిక

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 1977, 1978, 1979 సంవత్సరాల్లో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం గురువారం జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పాఠశాల ఆవరణలో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం తమకు విద్య నేర్పిన నాటి ఉపాధ్యాయులు నారాయణ శెట్టిని ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. నాటి గురువులు, నాటి విద్యార్థులతో తమ అనుభవాలను జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పూర్వ విద్యార్థులు తమ తమ స్నేహితులతో తాము చేసిన అల్లరి చిలిపి పనులను నెమరు వేసుకుని ఉత్సాహంగా గడిపారు. ప్రతి యేటా క్రిస్మస్ పర్వదినాన ఇలాంటి కలయిక ఉండాలని నిర్ణయించారు.


పాఠశాలలో గురువుతో పూర్వ విద్యార్థులు

టిడిపి జిల్లా అధికార ప్రతినిధిగా అనిల్‌కుమార్

ప్రజాశక్తి-శింగనమల



జిల్లా టిడిపి అధికార ప్రతినిధిగా నూతనంగా నియమితులైన మండల పరిధిలోని పెద్దమట్లగొందికి చెందిన కాయల అనిల్‌కుమార్ యాదవ్‌కు మండలంలోని నాయకులు, కార్యకర్తలు అభినందలు తెలిపారు. చాలాఏళ్లుగా పార్టీలో పని చేస్తున్న సీనియర్ నాయకులు అనిల్‌కుమార్ సేవలను గుర్తించిన అధిష్టానం జిల్లా అధికార ప్రతినిధిగా నియమించింది. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ తాను పార్టీకి చేసిన సేవలను గుర్తించి ప్రతినిధిగా పదవి ఇవ్వడం సంతోషకరమన్నారు. తన పదవికి కృషి చేసిన ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షులు పూల నాగరాజు, మాజీ అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్, సీనియర్ నాయకులు బండారు లీలావతి, తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు, కార్యకర్తలకు ఎల్లవేళలా రుణపడి ఉంటానని తెలిపారు.

1న శిల్పారామంలో నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి-అనంతపురం

నగర సమీపంలోని శిల్పారామంలో వేచ్చేనెల 1వతేదీన నూతన సంవత్సరం దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు శిల్పారామం పరిపాలనాధికారి పి.శివప్రసాద్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకూ ప్రముఖ కళాకారులతో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే ఇకపై ప్రతి శనివారం సాయంత్రం 5-30 నుంచి 7 గంటల వరకూ చెక్కబొమ్మలు, తోలుబొమ్మలు, మగ్గం వస్త్రాలు, రాగి, ఇత్తడి, పింగాణి, మట్టి వస్తువులు, చిత్రాలు ఇంకా ఏటికొప్పాక, కొండపల్లి, ఆళ్లగడ్డ, శెట్టిగుంట, ఓనిపెంట, నిమ్మలకుంట, అంగళ్లు, మదనపల్లి, మాధవరం, ధర్మవరం, మైలవరం, ప్రొద్దుటూరు, పామిడి, కంచి, కాళహస్తి, తదితర ప్రాంతాల్లోని చేతివృత్తుల కళాకారులు తయారీ విధానాన్ని ప్రొజెక్టర్ ద్వారా స్టేజ్‌పైన ప్రదర్శించనున్నట్లు వివరించారు. ఈ సదావకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అప్పిరెడ్డి హరినాథరెడ్డికి ఆటా లిటరరీ ఎక్సెలెన్స్ అవార్డు

ప్రజాశక్తి-అనంతపురం



సాహితీ సాంస్కృతిక రంగాల్లో రెండు దశాబ్దాలుగా కృషి చేసిన అప్పిరెడ్డి హరినాథరెడ్డికి అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఆటా) ఆటా ఎక్సెలెన్స్ అవార్డును ప్రకటించింది. ఈమేరకు హైదరాబాదులో డిసెంబర్ 12 నుంచి ప్రారంభమైన ఆటా వేడుకలు 27వతేదీన సాయంత్రం రవీంద్ర భారతిలో ముగియనున్నాయి. దీంతో ముగింపు సభలో హరినాథరెడ్డి అవార్డును అందుకోనున్నారు. కాగా అప్పిరెడ్డి హరినాథరెడ్డి రాయలసీమ ప్రాంతంలో వెలుగులోకి రాని అనేక సాహితీ సాంస్కృతిక అంశాలు, పత్రికలను వెలుగులోకి తెచ్చారు. సాధన పత్రికపై వీరు వెలువరించిన పుస్తకానికి కేంద్ర సాహిత్య అకాడమీ యువపురస్కారం కూడా 2014లో అందుకున్నారు. సాహిత్య పరిశోధనతో పాటు నిరంతరం రాయల సామాజిక సమకాలీన విషయాలపై వందలాది వ్యాసాలు రాశారు. కేవలం సాహిత్య పరిశోధనలకే పరిమితం కాకుండా వేమన అధ్యయన, అభివృద్ధి కేంద్రం, రాయలసీమ సాంస్కృతిక వేదిక, వేమన ఫౌండేషన్ తదితర సంస్థలు స్థాపించి సాహితీ కార్యక్రమాలు, రాయలసీమ సాంస్కృతికోద్యమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దశాబ్ధకాలంగా రాయలసీమ మహాకవి సమ్మేళనాలు, సీమ సాహితీ పోటీలు, తెలుగు భాషా సాహిత్య కార్యక్రమాలు, ఉపన్యాసాలు, సదస్సులు, ప్రదర్శనలు నిర్వహిస్తూ కొత్తతరం సాహిత్యరంగలోకి రావడానికి కృషి చేసారు. వేమన భావాజాలం విద్యార్థులలోకి తీసుకెళ్ళడానికి ప్రతి ఏడాది వంద విద్యాసంస్థలలో పద్యపోటీలు నిర్వహిస్తున్నారు. ఆటా ఆహ్వానం పై చికాగో, నాటా ఆహ్వానంపై డల్లాస్ వెళ్లి సాహితీసభల్లో పాల్గొన్నారు.

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-నార్పల :

ప్రజాశక్తి దినపత్రిక రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం మండల కేంద్రంలో వైసిపి ఎస్సీ సెల్ నాయకులు ప్రభుదాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాస్తవాలను నిర్భయంగా ప్రజల్లోకి తీసుకెళ్తూ ప్రజలపక్షంగా నిలుస్తున్న ప్రజాశక్తి దినపత్రిక భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.


ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వైసిపి ఎస్సీ సెల్ నాయకులు ప్రభుదాస్